సిరియాపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు

దాడులపై స్పందించని హెచ్‌టీఎస్.. సిరియా ఆపద్ధర్మ ప్రధానిగా బషీర్

ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో ధ్వంసమైన సిరియాలోని ఓ నౌకా స్థావరం

డమాస్కస్, డిసెంబర్ 10: తీవ్ర సంక్షోభం నెలకొని ఉన్న సిరియాపై ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు ఆకస్మికంగా దాడులకు దిగాయి. ఆ దేశ రాజధాని డమాస్కస్‌లో 25 కిలోమీటర్ల వరకు ఇజ్రాయెల్ యుద్ధ విమానాలు చొచ్చుకు వచ్చాయని సిరియన్ ప్రతిపక్ష వార్ మానిటర్ మంగళవారం తెలిపింది. అయితే ఈ ఆరోపణలను ఇజ్రాయెల్ ఖండించింది. అసోసియేట్ ప్రెస్ తెలిపిన వివరాల ప్రకారం సిరియా నగరం, సబర్బన్ ప్రాంతాల్లో భారీ యెత్తున వైమానిక దాడులు జరిగాయి. సిరియా గగనతలంలో మిస్సైల్ లాంచర్లు, హెలికాప్టర్లు చక్కర్లు కొడుతున్న దృశ్యాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దాడులపై తిరుగుబాటుకు నేతృత్వం వహించి సిరియాను ఆక్రమించుకున్న హయత్ తాహిర్ అల్ షామ్ (హెచ్‌టీఎస్) ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే సిరియాలోని సుమారు 400 కిలోమీటర్ల పరిధిలోని బఫర్‌జోన్ గోలన్ హైట్స్‌ను ఇజ్రాయెల్ దళాలు ఆదివారం స్వాధీనం చేసుకున్నాయి. సిరియా అతివాదుల పాలనలోకి వెళ్లనున్నందున ముందు జాగ్రత్త చర్యగా ఆ దేశంలోని రసాయన ఆయుధగారాలు, భారీ ఆయుధ స్థావరాలపై దాడులు చేసినట్టు ఇజ్రాయెల్ తెలిపింది.

రెబల్స్ తాత్కాలిక ప్రభుత్వం

అధికారాన్ని కైవసం చేసుకున్న సిరియన్ తిరుగుబాటుదారులు తాత్కాలిక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఆపద్ధర్మ ప్రధాన మంత్రిగా మహమ్మద్ అల్ బషీర్ పేరును ఖరారు చేశారు. ఈ తాత్కాలిక ప్రభుత్వం మార్చి 1 వరకు అధికారంలో ఉంటుందని దేశ అధికారిక టెలివిజన్ టెలిగ్రామ్ అకౌంట్‌లో ప్రకటించారు. ఇంతకుముందు వాయువ్య సిరియా, ఇడ్లిబ్‌లోని కొన్ని ప్రాంతాలను పాలించిన హయత్ తహ్రిర్ అల్ షామ్(హెచ్‌టీఎస్) ప్రభుత్వాధినేతగా వ్యవహరించారు.

'మానవ వధశాల'లో దారుణ పరిస్థితులు

అసద్ పాలన నుంచి విముక్తి లభించడంతో సంబరాలు చేసుకుంటున్న సిరియా ప్రజలు.. సైద్నాయ జైలులోని దారుణ పరిస్థితులు చూసి చలించిపోయారు. అసద్ పాలనను వ్యతిరేకించేవారిని 'మానవ వధశాల'గా పిలిచే ఈ జైలులో బంధించే వారు. కనీసం కిటికీలు కూడా లేని చిన్న చిన్న గదుల్లో పదుల సంఖ్యలో ఖైదీలను పెట్టి హింసించేవారు. అసద్‌ను వ్యతిరేకించిన వేలాది మంది సిరియన్లు కనిపించకుండా పోయారు. వీరిని వెతుక్కుంటూ బంధువులు సైద్నాయ జైలులోకి చొచ్చుకెళ్లారు. తిరుగుబాటుదారులు అడ్డుకున్నా లెక్కచేయకుండా వెళ్లి బందీలుగా ఉన్న వారిని విడిపించారు. అనేక ఏండ్ల తర్వాత తమ ఆత్మీయులను చూసుకొని కన్నీరు పెట్టుకున్నారు. ఈ జైలులో భూగర్భంలో ఐదు అంతస్థులు ఉన్న అండర్‌గ్రౌండ్ జైలు కూడా ఉంది. అసద్ వ్యతిరేకులను ఇక్కడికి తీసుకొచ్చి విద్యుత్తు షాక్ ఇవ్వడంతో పాటు దారుణంగా హింసించే వారని చెప్తున్నారు. ఈ జైలులో 2011 నుంచి 2016 మధ్య 13 వేల మంది సిరియన్లను ప్రభుత్వ బలగాలు రహస్యంగా హతమార్చాయని మానవ హక్కుల సంస్థలు చెప్తున్నాయి.

జడ్జి విద్వేష పూరిత ప్రసంగం?

అలహాబాద్ హైకోర్టును నివేదిక కోరిన సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ/లక్నో, డిసెంబర్ 10: విశ్వ హిందూ పరిషత్ నిర్వహించిన ఒక కార్యక్రమంలో న్యాయ నైతికతను ఉల్లంఘించి జడ్జి శేఖర్ కుమార్ యాదవ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ వచ్చిన ఆరోపణలపై నివేదిక పంపాలని అలహాబాద్ హైకోర్టుకు సుప్రీం కోర్టు మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. విద్వేషపూరిత ప్రసంగం చేసిన జడ్జిపై అభిశంసన తీర్మానం పెట్టాలని రాజ్యసభ ఎంపీ కపిల్ సిబల్ డిమాండ్ చేశారు. డిసెంబర్ 8న వీహెచ్‌పీ యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో నిర్వహించిన ఒక కార్యక్రమంలో జడ్జి శేఖర్ కుమార్ మాట్లాడారు. సామాజిక సామరస్యం, లౌకిక వాదం, లింగ సమానతను ప్రోత్సహించడమే యూనిఫామ్ సివిల్ కోడ్ (ఉమ్మడి పౌరస్మృతి) ప్రధాన ధ్యేయమని అన్నారు. అయితే ఒక రోజు అనంతరం రెచ్చగొట్టే అంశాలపై జడ్జి చేసిన ప్రసంగాలు వైరల్ కావడంతో విపక్షాలు సహా పలు వర్గాల నుంచి వ్యతిరేకత రావడమే కాక విద్వేషపూరిత ప్రసంగం చేసిన జడ్జిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

మాధవ్ గాడ్గిల్‌కు 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్'

ఐరాస అత్యున్నత పర్యావరణ పురస్కారం

న్యూఢిల్లీ, డిసెంబర్ 10: ఐక్యరాజ్యసమితి (ఐరాస) అత్యున్నత పర్యావరణ పురస్కారం 'చాంపియన్స్ ఆఫ్ ఎర్త్ అవార్డ్'కు భారత్‌కు చెందిన ప్రముఖ పర్యావరణ శాస్త్రవేత్త మాధవ్ గాడ్గిల్ (82) ఎంపికయ్యారు. 2024 ఏడాదికి సంబంధించి అవార్డ్ గ్రహీతల జాబితాను ఐరాస మంగళవారం విడుదల చేసింది. ప్రపంచంలోనే అత్యంత జీవ వైవిధ్యాన్ని కలిగిన పశ్చిమ కనుమల్లో పర్యావరణ పరిరక్షణకు ఆయన చేసిన కృషిని గుర్తిస్తూ పురస్కారానికి ఐరాస ఎంపికచేసింది. ఈ ఏడాది అవార్డు గ్రహీతల్లో భారత్ నుంచి మాధవ్ గాడ్గిల్ ఒక్కరికే చోటు దక్కింది. గతంలో కేంద్రం ఏర్పాటుచేసిన ప్యానెల్‌కు మాధవ్ గాడ్గిల్ నేతృత్వం వహించారు. పురస్కారానికి ఎంపిక కావటంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.

వారానికి 4 రోజులే పని!

జపాన్ ప్రభుత్వం కొత్త విధానం

పిల్లల్ని కనేందుకు ఆఫర్లు

టోక్యో: దేశంలో జననాల రేటును పెంచేందుకు జపాన్ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతున్నది. వారానికి నాలుగు రోజుల పని దినాలను అమలు చేయాలని నిర్ణయించింది. దీని వల్ల క్షీణిస్తున్న సంతానోత్పత్తి సమస్యను ఎదుర్కోవచ్చని ప్రభుత్వం భావిస్తున్నది. జపాన్‌ను ప్రస్తుతం వృద్ధ జనాభా సంఖ్య ఆందోళనకు గురిచేస్తున్నది. దేశ జనాభా మొత్తంగా తగ్గుతున్నప్పటికీ 65 ఏండ్లు పైబడిన వృద్ధులు దేశంలో 29.3%మంది ఉండడం ప్రభుత్వాన్ని ఆందోళనపరుస్తున్నది. కొత్త విధానం ప్రకారం ప్రభుత్వ ఉద్యోగులు వారానికి 3 రోజులు కుటుంబంతో గడపవచ్చు. టోక్యో మహిళా గవర్నర్ యురికో కొయికే ఈ ఆలోచనను అమలు చేయనున్నారు.

'విల్లో'తో కంప్యూటింగ్ విప్లవం

- గూగుల్ క్వాంటమ్ చిప్ ఆవిష్కరణ
- సూపర్ కంప్యూటర్ల బలాదూర్



న్యూయార్క్, డిసెంబర్ 10: క్వాంటమ్ కంప్యూటింగ్ రంగంలో గూగుల్ సరికొత్త విప్లవాన్ని సృష్టించింది. 'విల్లో' పేరుతో కొత్త క్వాంటమ్ చిప్‌ను ఆవిష్కరించింది. ప్రస్తుతం ప్రపంచంలో ఉన్న వేగవంతమైన సూపర్ కంప్యూటర్ల కంటే ఇది గణనీయమైన వేగంతో పని చేస్తుందని గూగుల్ పేర్కొన్నది. కంప్యూటింగ్‌లో ఎర్రర్‌లను తగ్గించడంతో పాటు వేగాన్ని భారీగా పెంచడం 'విల్లో' ప్రత్యేకత అని ప్రకటించింది. కంప్యూటర్ల వేగాన్ని పరీక్షించేందుకు ప్రమాణంగా పేర్కొనే రాండమ్ సర్క్యూట్ సాంప్లింగ్(ఆర్‌సీఎస్) లెక్కను ఇది కేవలం ఐదు నిమిషాల లోపే పూర్తి చేసింది. ఇదే లెక్క ప్రపంచంలోనే వేగవంతమైన సూపర్ కంప్యూటర్ చేయడానికి 10 సెప్టిల్లియన్ సంవత్సరాలు పడుతుంది. సెప్టిల్లియన్ సంవత్సరాలు అంటే మన విశ్వం వయసు కంటే ఎక్కువ. సంక్లిష్టమైన గణిత సమస్యలను సంప్రదాయ కంప్యూటర్ వ్యవస్థల కన్నా వేగంగా క్వాంటమ్ ప్రాసెసర్లు పరిష్కరించగలవని విల్లో నిరూపించిందని గూగుల్ పేర్కొన్నది. అమెరికాలోని శాంటా బర్బరలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కేంద్రంలో విల్లోను గూగుల్ అభివృద్ధి చేసింది. సంప్రదాయ కంప్యూటర్ల ద్వారా చేయలేని అల్గారిథంలను నిర్వహించడంలో విల్లో కీలక అడుగు అని ఈ సందర్భంగా గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ తెలిపారు. సాంకేతిక పురోగతి, సామాజిక ప్రయోజనంలో కొత్త యుగానికి విల్లో మనల్ని మరింత చేరువ చేసిందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన చేసిన పోస్ట్‌కు టెస్లా సీఈఓ ఎలాన్ మస్క్ స్పందిస్తూ..'అద్భుతం' అని బదులిచ్చారు.

భూమికి సత్తువనిచ్చే ప్లాస్టిక్!

- పర్యావరణ కాలుష్యానికి చెక్
- జపాన్ పరిశోధకుల ఆవిష్కరణ

టోక్యో: పర్యావరణ హితకరమైన ప్లాస్టిక్ తయారీలో జపాన్ శాస్త్రవేత్తలు విప్లవం సృష్టించారు. సముద్రపు నీటిలో కలిసి, కొద్ది గంటల్లోనే ఈ ప్లాస్టిక్ కరిగిపోతుంది. దీనిని ఆర్ ఐకేఈఎన్ సెంటర్ ఫర్ ఎమర్జెంట్ మ్యాటర్ సైన్స్ పరిశోధకులు అభివృద్ధి చేశారు. ఈ ప్లాస్టిక్‌ను ప్యాకేజింగ్ నుంచి మెడికల్ డివైసెస్ వరకు అన్ని రకాల వస్తువుల తయారీకి ఉపయోగించవచ్చు. వేర్వేరు పరిశ్రమల్లో వాడటానికి సురక్షితమైన, విషరహిత పదార్థాలతో దీనిని తయారు చేశారు. సాధారణ ప్లాస్టిక్స్ ఈ విధంగా కరగాలంటే వందల సంవత్సరాలు పడుతుంది. జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ప్లాస్టిక్ సముద్ర జలాల్లో కొద్ది గంటల్లోనే కరిగిపోతుంది. భూమిలో కలిస్తే 10 రోజుల్లో క్షీణిస్తుంది.

లింగాయత్‌ల కోటా పోరు హింసాత్మకం

కర్ణాటకలో నిరసనకారులపై పోలీసుల లాఠీచార్జి

బెంగళూరు: కర్ణాటకలో తమకు రిజర్వేషన్ కోటాను పెంచాలని కోరుతూ లింగాయత్ పంచమశాలి శాఖ మఠాధిపతి బసవజయ మృత్యుంజయ స్వామీజీ సారథ్యంలో నిరసనకారులు చేపట్టిన ఆందోళన మంగళవారం బెళగావిలో హింసాత్మకంగా మారింది. శీతాకాల సమావేశాలు జరుగుతున్న అసెంబ్లీని ముట్టడించేందుకు నిరసనకారులు ప్రయత్నించగా వారిని చెదరగొట్టేందుకు పోలీసులు లాఠీచార్జి చేశారు. తమ డిమాండ్లను నెరవేర్చని పక్షంలో అసెంబ్లీని దిగ్బంధిస్తామని హెచ్చరిస్తూ ఆందోళనకారులు విధాన్ సౌధకు బయల్దేరడంతో వారిని అడ్డుకునేందుకు పోలీసులు బలప్రయోగం చేశారు. బీజేపీ నాయకులతోపాటు స్వామీజీని పోలీసులు ముందస్తు కస్టడీలోకి తీసుకున్నారు. ప్రభుత్వ వాహనాలతోపాటు ఎమ్మెల్యేలకు చెందిన వాహనాలను సైతం నిరసనకారులు ధ్వంసం చేశారు. గత అసెంబ్లీ ఎన్నికలలో కాంగ్రెస్‌కు అనుకూలంగా పనిచేసిన పంచమశాలి శాఖకు ప్రస్తుతం ప్రభుత్వ విద్యా సంస్థలు, ఉద్యోగాలలో 5 శాతం రిజర్వేషన్ ఉంది. దీన్ని 15 శాతానికి పెంచాలని వారు ఆందోళన చేపట్టారు.

ఈవీఎంలు వద్దు!

మహారాష్ట్రలో మరో గ్రామం తీర్మానం

పుణె: ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఈవీఎంల వినియోగంపై దేశ వ్యాప్తంగా పలు అనుమానాలు వ్యక్తం అవుతున్న క్రమంలో తమకు ఈవీఎంలు వద్దు, బ్యాలెట్ పేపరే కావాలంటూ మరో గ్రామం డిమాండ్ చేసింది. ఇక ముందు గ్రామంలో జరిగే ఏ ఎన్నిక అయినా బ్యాలెట్ పేపర్ ద్వారానే నిర్వహించాలని డిమాండ్ చేస్తూ మహారాష్ట్ర సతారా జిల్లాలోని కొలేవాడి గ్రామ సభ తీర్మానించింది. గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు డిసెంబర్ 2న ఈ తీర్మానం చేసినట్టు సర్పంచ్ భర్త మంగళవారం తెలిపారు.

ఈవీఎంల ట్యాంపరింగ్‌పై సుప్రీంకు ఇండియా కూటమి

న్యూఢిల్లీ: ఇటీవల జరిగిన హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల్లో అనూహ్య పరాజయం పొందిన ఇండియా కూటమి.. ఈవీఎంల రిగ్గింగే తమ ఓటమికి ప్రధాన కారణమని భావిస్తున్నది. ఈవీఎంల్లో అనేక అవతవకలు జరిగినట్టు కూటమి ఆరోపించింది. అయితే దీనిని ఈసీ తిరస్కరించింది. దానితో సంతృప్తి చెందని కూటమి నేతలు ఈవీఎంల అవకతవకలపై సుప్రీం కోర్టును ఆశ్రయించనున్నారు. శుక్రవారం లోగా దీనిపై పిటిషన్‌ను వేస్తారని కూటమి నేతలు తెలిపారు.

భార్య వేధింపులపై 24 పేజీల సూసైడ్ నోట్

బెంగళూరులో యూపీ టెకీ ఆత్మహత్య

బెంగళూరు, డిసెంబర్ 10: భార్య, ఆమె కుటుంబ సభ్యుల వేధింపులు తాళలేక ఉత్తరప్రదేశ్‌కు చెందిన 34 ఏండ్ల టెకీ బెంగళూరులో ఆత్మహత్య చేసుకున్నాడు. ఇందుకు సంబంధించి 24 పేజీల సుదీర్ఘమైన సూసైడ్ నోట్‌ను, 1.5 గంటల వీడియోను అతడు రికార్డ్ చేశాడు. తన భార్య, ఆమె కుటుంబ సభ్యులు తనపై తప్పుడు కేసులు బనాయించి వేధిస్తున్నారని అతడు వెళ్లగక్కిన ఆవేదన సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. పోలీసుల కథనం ప్రకారం.. మృతుడు అతుల్ సుభాష్ సోమవారం తన నివాసంలో ఉరేసుకొని ప్రాణాలు తీసుకున్నాడు. ఈ తీవ్రమైన నిర్ణయం తీసుకోవడానికి ముందు అతడు తన సూసైడ్ నోట్, వీడియోను పలువురికి ఈ-మెయిల్ చేశాడు. తాను సభ్యుడిగా ఉండే ఎన్జీవో వాట్సప్ గ్రూప్‌లోనూ షేర్ చేశాడు. 'న్యాయం బకాయి ఉంది' అన్న ప్లకార్డును తన ఇంట్లో వేలాడదీశాడు. సూసైడ్ నోట్‌లో తన భార్యతో కొనసాగుతున్న వైవాహిక బంధ వివాదం గురించి పేర్కొన్నాడు. భరణం కోసం తమ నాలుగేండ్ల కొడుకును తన భార్య తనపైకి అస్త్రంగా ప్రయోగించిందని ఆరోపించారు. ఉత్తరప్రదేశ్ కుటుంబ న్యాయస్థానంలో తనపై తన భార్య కుటుంబం పెట్టిన కేసుల్లో హత్య, అసహజ శృంగారం, భరణం కోసం నెలకు రూ.2 లక్షల డిమాండ్ ప్రధానమైనవని వెల్లడించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు బెంగళూరు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా, టెకీ ఆత్మహత్య నేపథ్యంలో 'మెన్‌టూ' అన్నది ఎక్స్‌లో ట్రెండింగ్‌గా మారింది. చట్టాలన్నీ మహిళలకు అనుకూలంగానే ఉన్నాయని నెటిజన్లు పోస్టులు పెట్టారు.

వినియోగదారుల సదస్సులో మాట్లాడుతున్న వేణుగోపాలాచారి

విద్యుత్ సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ధర్మారం, డిసెంబర్ 10: విద్యుత్ సమస్యలను సత్వరమే పరిష్కరించి, ప్రజల మన్నన లు పొందాలని వరంగల్ ఎన్‌పీడీసీఎల్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక ఫోరం చైర్మన్ ఎన్ వేణుగోపాలాచారి అధికారులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ ఆవరణలో జరిగిన విద్యుత్ వినియోగదారుల సదస్సుకు ఫోరం టెక్నికల్ మెంబర్ కే రమేశ్, ఫైనాన్స్ మెంబర్ ఆర్ చరణ్‌దాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వినియోగదారులు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. అనంతరం చైర్మన్ వేణుగోపాలాచారి మాట్లాడుతూ, విద్యుత్ ఉన్నతాధికారులు, ఏఈలు విద్యుత్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. ముఖ్యంగా రైతులకు ఇబ్బంది కలుగనివ్వద్దన్నారు. విద్యుత్ సర్వీస్ మీటర్లలో ఏదైనా లోపం ఉంటే ప్రత్యామ్నాయంగా మరొకటి అమర్చి సమస్యను తలెత్తకుండా చూడాలన్నారు. సదస్సులో ఏడీఈ విజయ్ గోపాల్‌సింగ్, ధర్మారం, ఖిలా వనపర్తి, జూలపల్లి ట్రాన్స్‌కో అదనపు అసిస్టెంట్ ఇంజినీర్లు ఎండీ ఖాసీం, మహిపాల్‌రెడ్డి, జులేష్, తదితరులున్నారు.

నిజాయితీతో విధులు నిర్వర్తించాలి

- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్

సమావేశంలో మాట్లాడుతున్న రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 10: పోలీస్‌శాఖలో ప్రతిఒక్కరూ ప్రలోభాలకు గురికాకుండా నిజాయితీతో విధులు నిర్వర్తించాలని రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. మంగళవారం కమిషనరేట్ కార్యాలయ సమావేశ హాల్‌లో నూతన సాయుధ దళ(ఏఆర్) కానిస్టేబుళ్లకు సీపీ దిశానిర్దేశం చేశారు. ఇతర శాఖలతో పోలిస్తే పోలీస్‌శాఖ విధులు సవాళ్లతో కూడినదని చెప్పారు. సమయపాలనా పాటిస్తూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. ఇక్కడ అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సుందర్ రావు, ఆర్ఐలు దామోదర్, వామనమూర్తి, శ్రీనివాస్, మల్లేశం సంపత్ ఉన్నారు.

నిషేధాజ్ఞలు కొనసాగింపు

పోలీస్ కమిషనరేట్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించడంపై అమలులో ఉన్న నిషేధాజ్ఞలను కొనసాగిస్తున్నట్లు రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అలాగే పిల్లలు, వృద్ధులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు గానూ డీజే సౌండ్ వినియోగంపై కూడా నిషేధాజ్ఞలు విధించినట్లు తెలిపారు. ఈ నిషేధాజ్ఞలు వచ్చే నెల జనవరి ఒకటో తేదీ వరకు అమలులో ఉంటాయని, ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.

నాణ్యమైన బొగ్గు అందించాలి: జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్ 10: వినియోగదారులకు నాణ్యమైన బొగ్గును అందించాలని ఏరియా జీఎం బండి వెంకటయ్య సూచించారు. మల్టీ డిపార్ట్‌మెంట్ టీం మంగళవారం ఓసీపీ-3, సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సభ్యులతో కలిసి జీఎం పాల్గొని మాట్లాడారు. సంస్థ చైర్మన్ బలరాం ఆదేశాల మేరకు మల్టీ డిపార్ట్‌మెంటు కమిటీ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 2024-25 సంవత్సరంలో కంపెనీ లక్ష్యాలు, భూగర్భ గనుల, యంత్రాల వినియోగం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉద్యోగులకు వివరించారు. అనంతరం ఉద్యోగులతో రక్షణ ప్రతిజ్ఞ చేయించారు. సమావేశంలో ఏఐటీయూసీ గుర్తింపు సంఘం కార్యదర్శి జీగురు రవీందర్, టీం సభ్యులు నరిసింహరావు, రాముడు, అనిల్ కుమార్, మురళీకృష్ణ, తిరుపతి రెడ్డి, సదానందం, షరీఫ్ మహ్మద్, ఫిట్ సెక్రెటరీ సెగ్గం శంకర్ పాల్గొన్నారు.

నేటి నుంచి జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శనలు

పెద్దపల్లికమాన్, డిసెంబర్ 10: జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ అవార్డుల ప్రదర్శనలను ఈ నెల 11 నుంచి 13వ వరకు ఎన్టీపీసీ (జ్యోతినగర్)లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నట్లు డీఈవో డీ మాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర, శాస్త్ర సాంకేతిక మంత్రిత్వశాఖ, ఎన్‌సీఈఆర్‌టీ ఆదేశాల మేరకు మూడు రోజులు జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన (డీఎల్‌బీవీపీ-2024-25), జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డ్స్ మనాక్ (డీఎల్ఈపీసీ-2023-24) ప్రదర్శనలను ఒకే వేదికపై నిర్వహించనున్నట్లు వివరించారు. 'సుస్థిరమైన భవిష్యత్ కోసం శాస్త్ర సాంకేతికత' అనే ప్రధాన అంశంపై ఆహారం, ఆరోగ్యం, పరిశుభ్రత, రవాణా-సమాచార రంగం, సేంద్రియ వ్యవసాయం, విపత్తుల నిర్వహణ, గణిత నమూనాలు, కంప్యూటేషనల్ థింకింగ్, వ్యర్థాల నిర్వహణ, వనరుల నిర్వహణ లాంటి ఏడు ఉప అంశాలపై వైజ్ఞానిక ప్రదర్శనలు ఉంటాయని వెల్లడించారు. గురువారం 'సుస్థిర భవిష్యత్తు- ఆరోగ్యానికి చిరుధాన్యాలు' అంశంపై సదస్సు నిర్వహించనున్నట్లు వివరించారు. ఒక పాఠశాల నుంచి ఒక ఉపాధ్యాయుడు మాత్రమే హాజరు కావాలని డీఈవో సూచించారు.

సామాజిక న్యాయానికి కట్టుబడి ఉండాలి

కాల్వశ్రీరాంపూర్, డిసెంబర్10: ఎస్సీల ఏబీసీడీ వర్గీకరణ, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉండాలని ఎంఎస్పీ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇంజం వెంకటస్వామి డిమాండ్ చేశారు. కాల్వశ్రీరాంపూర్ లో మంగళవారం ఎమ్మార్పీఎస్ మండల సమావేశం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన తరువాత రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిపై నాయకులు అసహనం వ్యక్తం చేశారు. వర్గీకరణకు అడ్డుపడితే ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో మండల ఇంచార్జి అడప నర్సయ్య, కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి రుద్రారపు రాంచంద్రం, జిల్లా అధ్యక్షుడు అంబాల రాజేందర్, ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు మంథన చందు, నాయకులు తూండ్ల రాజయ్య, పుల్లూరి సాగర్, కొంద్ర వివేక్, చలిగంటి స్వరూప, జగన్, దర్శనాల రాజనర్సు, కుంట శ్రీకాంత్, చవి, మోటం రాజశేఖర్, రవి, లక్ష్మి, తాండ్ర సదయ్య, రామస్వామి, అంబాల నవీన్, రవితేజ, లింగస్వామి, ఆకాశ్ ఉన్నారు.

అవకతవకలపై ఫిర్యాదు

కోల్‌సిటీ, డిసెంబర్ 10: రామగుండం ఐసీడీఎస్ ప్రాజెక్టులో ఇటీవల జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐసీడీఎస్ ప్రాజెక్టు కమిషనర్‌కు ఫిర్యాదు చేసినట్లు ఏఐటీయూసీ నాయకులు ఎంఏ గౌస్, మద్దెల దినేశ్ తెలిపారు. గోదావరిఖని విఠల్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో 12 ఏళ్ల నుంచి ఆయాగా పని చేస్తున్న జగదీశ్వరి విషయంలో న్యాయం చేయాలని జిల్లా అధికారులకు విన్నవించినా స్పందించకపోవడంతో పై అధికారులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు. సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.

సన్మానం

జూలపల్లి, డిసెంబర్10: మున్నూరు కాపు సంఘం జూలపల్లి గ్రామ కమిటీ సభ్యులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. భవిష్యత్‌తో మున్నూరు కాపుల అభ్యున్నతికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఇక్కడ నాయకులు నాడెం శ్రీధర్, గుమ్మడి శంకరయ్య, కొప్పుల మహేశ్, బండి రాజయ్య, కట్కం మల్లయ్య, బండి స్వామి, వంగపెల్లి వెంకటరమణ, ఐల కిషన్, రమేశ్, రాజిరెడ్డి ఉన్నారు.

ప్రత్యామ్నాయం చూపించాలి

గోదావరిఖని, డిసెంబర్ 10: రామగుండం నగరపాలక సంస్థ ఏరియాలో ఉన్న యు రాములు స్మారక స్తూపాన్ని తొలగించేముందు.. స్మారక స్తూపం నిర్మాణానికి ప్రత్యామ్నాయం చూపించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఐ కృష్ణ పేర్కొన్నారు. మంగళవారం గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. స్మారక స్తూపం స్థలంలో జంక్షన్, సిగ్నల్‌పాయింట్ ఏర్పాటుకు సహకరించాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కోరగా, ప్రత్యామ్నాయంగా స్థలం లేదా నిర్మాణం చేపట్టాలని తాము కోరామన్నారు. అయినప్పటికీ మున్సిపల్ కమిషనర్ సరైన హామీ లేకుండా మాట్లాడడం సరికాదన్నారు. స్తూపాన్ని తొలగిస్తే జరిగే ఆందోళనకు అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. ఇక్కడ ఐఎఫ్‌టీయూ నాయకులు బీ అశోక్, కే మల్లేశ్, ఎం కొమురయ్య, ఎస్ తిరుపతి, దావన పల్లి రాజేశం, ఎడ్ల రవి, తదితరులు ఉన్నారు.

చట్టబద్ధ హక్కులు అమలు చేయాలి

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబర్10: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు చట్టబద్ధ హక్కులు అమలు చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అశోక్ కోరారు. ఆర్జీ-2 బంగ్లాస్ ఏరియాలో మంగళవారం జనరల్ బాడీ సమావేశం దుర్గం బాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ, సింగరేణిలో దాదాపు 30వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని, చట్టబద్ధ హక్కులు అమలు చేయకపోవడంతో వారు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కోల్ ఇండియాలో 2013నుంచి హైపవర్ కమిటీ వేతనాల అమలుకు ఆదేశాలిచ్చినా.. సింగరేణి యాజమాన్యం అమలుచేయడం లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 22వ జీవోను గెజిట్‌చేసి, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు అమలు చేయాలన్నారు. ఇక్కడ నేతలు రమేశ్, ఇరుగురాల గట్టయ్య, గుడిసెల రాయమల్లు, రామగిరి మధునమ్మ, కాసిపేట రాజేశ్వరి, గట్టమ్మ, భూమేశ్, శంకరక్క, రజిత, సుభద్ర, రాజయ్య, రాజబాబు, ప్రవీణ్, లక్ష్మి, సమ్మయ్య ఉన్నారు.

సోషల్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా మిట్ట తిరుపతి

నియామకపత్రం అందుకుంటున్న తిరుపతి

ధర్మారం,డిసెంబర్ 10: సోషల్ జస్టిస్ ఫర్ వరల్డ్ హ్యూమన్ రైట్స్ జిల్లా చైర్మన్‌గా నంది మేడారం గ్రామానికి చెందిన మిట్ట తిరుపతి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం తిరుపతికి హ్యూమన్ రైట్స్ జాతీయ చైర్మన్ డాక్టర్ కొప్పుల విజయ్ కుమార్ నియామక పత్రాన్ని హైదరాబాద్‌లో అందజేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ ప్రజల సామాజిక న్యాయం కోసం కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన జాతీయ అధ్యక్షుడు విజయ్ కుమార్‌కు తిరుపతి కృతజ్ఞతలు తెలిపారు.

కెరీర్ గైడెన్స్, సైన్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం

ముత్తారం, డిసెంబర్10: దర్యాపూర్ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఐఐటీ మద్రాస్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రీ కెరీర్ గైడెన్స్, సైన్స్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడారు. 9నుంచి ఇంటర్మీడియట్ వరకు ఏం చదవాలి, ఏం చదివితే బాగుంటుందనే సందిగ్ధత ప్రతి విద్యార్థిలో ఉంటుందన్నారు. కెరీర్ గైడెన్స్ టెస్ట్ రూపకర్త, ఐఐటీయన్ కొండవీటి బాలరాజు, ప్రొఫెసర్ శ్రీనివాస చక్రవర్తి, ఐఐటీయన్ పింగిలి విక్రమ్‌కుమార్ పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి టెస్ట్ రిపోర్టులు, సైన్స్ పుస్తకాలను అందజేశారు. ప్రిన్సిపాల్ కేసరి సంతోష్ కు మార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఏఎంవో డాక్టర్ షేక్, ఎంపీడీవో సురేశ్, ఎంఈవో ఓదెలు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ శారద పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో అన్నదానం

కోల్‌సిటీ, డిసెంబర్ 10: కేశోరాం కాంట్రాక్ట్ కార్మిక సంఘం అధ్యక్షుడు కౌశిక హరి జన్మదినం సందర్భంగా గోదావరిఖనిలోని ఎండీహెచ్‌డబ్ల్యూఎస్ అనాథ పిల్లల ఆశ్రమం, శ్రీ ధర్మశాస్త్ర నిత్యాన్నదాన వేదికతోపాటు పోచమ్మ మైదానంలో మంగళవారం అన్నదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తోడేటి శంకర్ గౌడ్, పున్నం శశికుమార్, చిక్కుడు శేఖర్, కళ్యాణ్, తిరుపతి, కందుకూరి రాజు, సాయికుమార్, సాగర్, రాజేందర్, వంశీకృష్ణ, అనిల్, నరేశ్, తదితరులు పాల్గొన్నారు.

₹7లక్షల పరిహారం

జ్యోతినగర్(రామగుండం), డిసెంబర్ 10: రామగుండం రైల్వే వర్క్‌షాప్‌లో కాంట్రాక్ట్ కార్మికుడు బంపట్ల ప్రసాద్ గత జూలై 7న మృతిచెందగా, సంబంధిత ధనలక్ష్మీ ఇంజినీరింగ్ ఎంటర్‌ప్రైజెస్ బాధిత కుటుంబానికి ₹7లక్షల నష్టపరిహారం అందజేసింది. మంగళవారం రైల్వే డిపో లో రైల్వే అధికారులు, సీఐటీయూ నాయకుల సమక్షంలో బాధిత కుటుంబ సభ్యులకు ₹2లక్షల నగదు, తల్లి బంపట్ల పార్వతికి ₹5లక్షలు ఆమె బ్యాంకు ఖాతాలో జమ చేశారు. ఇక్కడ రైల్వే అధికారి రామకృష్ణ, రైల్వే కాంట్రాక్ట్ యూనియన్ నాయకులు ఎం రామాచారి, భిక్షపతి, బొంకూరి మహేశ్, ఎండీ యాసిన్, ఎం తిరుపతి ఉన్నారు.

వైద్య విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

సిమ్స్ వైద్య విద్యార్థులకు అభినందనలు

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 10: చండీగర్ రాజధానిలో ఇటీవల జరిగిన జాతీయ బయో కెమిస్ట్రీ సదస్సులో పాల్గొన్న రామగుండం సింగరేణి వైద్యకళాశాల రెండో సంవత్సర విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్ అభినందనలు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతోపాటు బయోకెమిస్ట్రీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అశోక్ వర్ధన్‌ను మంగళవారం కళాశాలలో ప్రిన్సిపాల్ అభినందించారు. ఈ ప్రదర్శనకు సహకరించిన ప్రిన్సిపాల్ డాక్టర్ హిమబిందుసింగ్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జీ నరేందర్, అధ్యాపక బృందానికి పరిశోధన విద్యార్థులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌వర్ధన్ కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ వైద్య విద్యార్థులు అనూష, రిషి, హర్షవర్ధన్, సాత్విక్, అభిరామ్, సుదీప్, సృజన, తదితరులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో చోరీ

ఫర్టిలైజర్‌సిటీ, డిసెంబర్ 10: ఎల్కలపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రం (ఐకేపీ) సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. తమ వడ్ల కుప్పలో నుంచి దాదాపు 20బస్తాల ధాన్యాన్ని దుండగులు ఎత్తుకెళ్లారని బాధిత రైతులు ఏడెల్లి కిష్టస్వామి, గర్రెపల్లి సురేందర్, చిట్టబోయిన మల్లేశ్, గొంద్ర కనకయ్య, మేకల పోచం వాపోయారు. దీంతో కొనుగోలు కేంద్రంలో వడ్లు పోసిన రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

యైటింక్లయిన్ కాలనీ, డిసెంబర్ 10: ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితమని గోదావరిఖని ఆర్టీసీ డీఎం నాగభూషణం పేర్కొన్నారు. శబరిమలై అయ్యప్ప దర్శనం కోసం వెళ్లే భక్తులు, స్వాములకు ఆర్టీసీ సకాలంలో దర్శనం పూర్తి చేసి, సురక్షితంగా గమ్య స్థానానికి చేరుస్తుందన్నారు. ఇక్కడ అసిస్టెంట్ మేనేజర్ గీతకృష్ణ, ఎస్ఎస్ మూర్తి, అయ్యప్ప మాలధారులు, తదితరులు ఉన్నారు.

రామగుండంలో మళ్లీ ఆపరేషన్ కూల్చివేత

కోల్‌సిటీ, డిసెంబర్ 10: రామగుండం కార్పొరేషన్‌లో మళ్లీ ఆపరేషన్ కూల్చివేత చేపట్టారు. రెండు రోజుల క్రితం రోడ్ల వెడల్పు పేరిట లక్ష్మీనగర్‌లోని దుకాణాలను కూల్చివేసిన నగరపాలక, రెవెన్యూ అధికారులు, మంగళవారం పోలీస్ బందోబస్తు మధ్య ఓల్డ్ అశోక థియేటర్ స్థలంలోని ఇండియా ఏయిర్ కూలర్ దుకాణాన్ని నేలమట్టం చేశారు. రామగుండం తహసీల్దార్ కుమారస్వామితోపాటు నగరపాలక సంస్థ అధికారులు మంగళవారం ఉదయమే చేరుకొని ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తుండగా, బాధితుడు వేముల అశోక్ అడ్డుకునే ప్రయ త్నం చేశారు. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడుతూ, చాలాకాలం కిందటే తాను ఈ స్థలాన్ని లీజుకు తీసుకున్నానని తెలిపాడు. తన లీజు గడువును హైకోర్టు పొడిగించి సింగరేణికి ఆర్డర్ కూడా ఇచ్చిందన్నారు. అధికారులు షాపును కూల్చివేసి తనను రోడ్డు మీద పడేశారని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి

కోల్‌సిటీ, డిసెంబర్ 10: మనవ హక్కుల పరిరక్షణకు కృషి చేస్తున్నట్లు హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి శంకర్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మన హక్కులు-మన బాధ్యత అనే అంశంపై మార్కండేయ కాలనీలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఎండీ ఇబ్రహీం, మల్లికార్జున్, గోవర్ధన్, లింగస్వామి, అవినాశ్, రమేశ్, సురేశ్ పాల్గొన్నారు.